


"రేయ్, బావీ! మన త్రయంలోని మిగతా పక్షేదిరా? ఇంకా భక్తిరంజని పూర్తి కానేలేదు. అప్పుడే కథలు కాకరకాయల కోసం వీథుల్లోకి రెక్కలు కట్టుకుని ఎగిరి పోయాడా ఏమిటి?" అప్పుడే నిద్ర లేచిన మూర్తి తమ మిత్రుడు దివాకర్ కనిపించక పోతే నిద్ర మంచం మీదనుంచే ఆశ్చర్య పోతూ అడిగాడు.

బావి, మూర్తి, దివాకర్ ఉద్యోగాల వేట సాగించిన రోజుల్లో కలుసుకున్న మిత్రులు. ప్రస్తుతం ఒకే ఆఫీసులో పని చేస్తూ, ఒకే ఇంట్లో అద్దె తగ్గుతుందన్న ఉద్దేశంతో తలలు దాచుకుంటున్న మిత్రులు. దివాకర్ మంచి రచయిత అన్న భావం పాఠక లోకంలో చాలా మందికి ఉన్నా, మూర్తి దృష్టిలో మాత్రం దివాకర్ రాతలు కేవలం అర్థం పర్థం లేనివి.

"నీ వూహ సెంట్ పర్సెంట్ కరెక్ట్రా! గెంజి పేటలో ఏదో మూల నున్న ఇళ్ళు తగలబడ్డాయ్ కదా?" మూర్తి ఆశ్చర్యంతోకూడిన ప్రశ్నకు బావి సమాధానం! ప్రశ్న లాంటి సమాధానం.

"అవును! అవి తగలబడ్డాయ్! మనవాడు ఆదివారం పూటైనా మనతో సరదాగా గడపకుండా పొద్దున్నే మళ్ళీ ఎవరి కొంపలో అంటుకు పోయినట్లు వీథుల్లోకి పరుగెట్టడ మెందుకురా? రియల్లీ ఇట్ ఈజ్ వెరీ ఎస్టానిషింగ్!" మూర్తి.

"అదేరా నీకూ నాకూ గల తేడా! మనవాడంటే నీ కెప్పుడూ తేలిక భావమేరా! వాణ్ణి నీ వింకా వట్టి దివాకర్‌గానే అంచనా వేస్తున్నావ్! కానీ వాడిలోని మనిషిని—అంటే రచయితని—కవి హృదయాన్ని అర్థం చేసుకోలేక పోతున్నావ్!" బావి.

"అంటే, మన వాడింత అర్జంటుగా బయటకు పరుగు తీసింది కాగితాలు, కలం చంకన పెట్టుకు నన్నమాట! ఈ పాటికి ఏ మూలో కూర్చుని కాగితాలు బరాబరు చేస్తూ ఉండచ్చు!" నవ్వుతూ అన్నాడు మూర్తి.

"వాణ్ణి మరీ అలా తీసి పారేయకురా! నేటి సమాజాన్ని, పరిస్థితుల్ని అద్దంలో ప్రతిబింబంలా పాఠకుల ముందుంచగల ప్రతిభ, సామర్థ్యం ఏ కొద్ది మందికో కాని, అందరికీ అబ్బే విద్య కాదురా!" మూర్తి మాటలకు బాధ పడుతూ అన్నాడు బాచి.

"వాళ్లేరా! నీవే మెచ్చుకోవాలి వాణ్ణి! కాకుంటే నీకు తోడు మనింటి యజమాని ఆ పరంధామయ్యగా లాంటి వాళ్లే మెచ్చుకోవాలి. కథలు, కబుర్లు రాయడం నాకు చేత కాకున్నా ఏది మంచి రచనో, సమాజానికి పనికి వచ్చే రచనేదో ఆ మాత్రం నాకు తెలుసురా!" మూర్తి.

"అయితే వాడి రచనలు పచ్చి దరిద్రం అంటావ్! అంతేనా నీ అభిప్రాయం?" విసుక్కుంటూ బాచి.

"అలాని నే ననలేదే! రాసేవాడుకూడా సమాజంలోని ఒక మనిషే. కనక నేటి సమాజాన్ని, పరిస్థితుల్ని అవగాహన చేసుకుని రచనలు చేయడం మంచిదంటాను. అటువంటి రచనలే సమాజానికి కాస్త ప్రయోజనాన్ని ఆపాదించేవి!"

"అంటే వాడి రచనలు అలాంటివి కావంటావా?"

"ముమ్మాటికీ కాదురా బాచీ! ఏదో తోచింది రాసి పత్రికల్లో ప్రచురించడం గొప్ప కాదు."

"ఏమైనా మొదటినుంచీ వాడంటే నీకు మంచి అభిప్రాయం లేదురా! నీ వాగుడు కనక వాడు వింటే ఎంత బాధ పడతాడో ఒక్కసారి ఆలోచించరా మూర్తీ!"

"వాడున్నా, లేకున్నా నా అభిప్రాయం మాత్రం ఎప్పుడూ మారదురా! నిర్మొహమాటమైన మంచి విమర్శలే ఏ రచయితకైనా ఎదగడానికి దోహదం చేస్తాయ్! అఫ్‌కోర్స్, సరైన పద్ధతిలో అర్థం చేసుకుంటేనే అనుకో! చిన్న చిన్న సంఘటనల్లోంచి కథలు పుట్టించ గలగడం గొప్ప కాదురా! ఆ కథల్లో సామాజిక స్పృహ ఉండటం గొప్ప! ఆ కథల వల్ల సమాజానికి కించిత్ అయినా ప్రయోజనం కలగడానికి అవకాశం ఉండటం గొప్ప! అలా కాకుండా ఎప్పుడూ అర్థం పర్థం లేని రచనలు చేస్తూ, తద్వారా నాలుగు డబ్బులు చేసుకోవడం నిజంగా గొప్ప కానేకాదురా!" మూర్తి.

"అంటే, మనవాడిదంతా వూహాగానమంటావా? నిజంగా అలా వూహించి రాసేవాడే కనక అయితే మన వాడీ రోజు మొన్న ఇళ్ళంటుకున్న చోటుకి ఎందుకు వెళ్ళాడంటావ్?" బాచి.

"మనవాడు ప్రస్తుత సమాజానికి ఫోటో తీసే ఫోటోగ్రాఫర్ లాంటివాడు! కనిపించిన ప్రతి విషయం గురించి ముందు తన చూపుల కెమెరాతో ఫోటో తీస్తాడు. ఆ తరవాత తన మాటల గారడీతో దాన్ని డెవలప్ చేస్తాడు. అందుకే ఈ రోజంత ప్రొద్దున్నే మనవాడు బయటకు ఉడాయించాడు!"

"అర్థమయేట్లు చెప్పరా బాబూ!" బాచి.

"ఇందులో అర్థం కాని దేముందిరా!? . . . . రచయితలు కేవలం నేటి సమాజాన్ని — పరిస్థితుల్ని ఫోటో తీసే ఫోటోగ్రాఫర్స్‌లాగా గాకుండా సమాజంలోని మంచిని— చెడుని—ఎత్తుపల్లాల్ని చిత్రించే చిత్రకారులైతే చాలా మంచిదిరా! . . ."

"మా బాగా చెప్పేవురా పిల్లి అంటే— మార్జాలమన్నట్లు!. . . . మన దివాకర్ రాస్తున్న కథలన్నీ రోడ్లమీద నుంచో . . ఇరుగు పొరుగుల నోళ్ళలోంచో — స్నేహితుల మాటల్లోంచో— పుడుతున్నాయ్ కదా? . . . .అంటే వాస్తవానికి ఎంతో దగ్గరగా ఉంటున్నాయ్ కదా వాడి రచనలు!? . . ." బాచి.

"రేయ్, బాచీ! నీ బుర్రింకా పండలేదురా! నీ వెదిగినంతగా నీ ఆలోచనలు—మనస్సు మాత్రం ఇంకా ఎదగలేదురా! . . . . మన దివాకర్‌తో బాగా పరిచయం ఉన్నవాళ్ళు కూడా ఈ మధ్య మనవాడంటే భయపడుతున్నారు కదా? కారణం ఏమై ఉంటుంది? ఒక్కసారి ఆలోచించి చూడు!"

బాచి మౌనం వహించాడు.

"తన మీద కూడా ఏదైనా కథ రాసి ఇంటి గుట్టుని రచ్చకీడుస్తాడేమో నన్న భయం! మనవాడు తెలిసినవాళ్ళ సంతోషం గురించి— దుఃఖం గురించి— ఇరుగు పొరుగుల వింత మనస్తత్వాల గురించి—మంచి, చెడుల గురించి యథాతథంగా కథలు రాసేస్తుండటం వల్లే— వాడంటే నిజంగా చాలా మందికి హడల్! మనవాణ్ణి ఎరుగని వాళ్ళు మాత్రమే వాడిలోని రచయితని అభినందిస్తుంటారు. అఫ్‌కోర్స్, నీలాంటి వాళ్ళను ఒకర్నో, ఇద్దరినో మినహాయిస్తే! . . ."

"అంటే అలా కథలు రాయకూడదా!? . . ." బాచి ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నకు మూర్తి చిన్నగా మందహాసం చేశాడు.

"చెప్పేది పూర్తిగా విన్న తరవాత అలా రాయొచ్చో, రాయకూడదో నీ బుర్రతో నీవే ఆలోచించు. మనవాణ్ణి తెలియని వాళ్ళ దృష్టిలో వాడు మంచి రచయిత! తెలిసిన వాళ్ళు మాత్రం తమ బ్రతుకుల్ని—బాధల్ని అక్షర రూపంలో చూసుకుని మరింత బాధపడుతున్నారు. కొంత మంది తమ బాధని—కోపాన్ని మనవాడి ముఖం మీదే వెళ్ళగక్కుతున్నా — వాడికి చీమ కుట్టినట్లైనా ఉండటం లేదు. పైగా మీరిలా నా మీద ఏడ్చేకంటే చేతనైతే మీరు కూడా నా గురించి కథలు రాసుకోండి అంటూ తిక్కగా మాట్లాడుతున్నాడు. వీడితో మన కెందుకులే గొడవ?— అనుకుని మనవాణ్ణి తెలిసిన చాలా మంది ఈ మధ్య వాడికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. అనుకోకుండా ఎవరికైనా మనవాడు కనిపిస్తే— అంత వరకు తాము మాట్లాడుకుంటున్న వి: వది లేసి—మరో విషయంలోకి మా పోతున్నారు వాళ్ళు . . . ." మూర్తి ఇంకా ఏదో చెప్పబోతున్నంతలో— "పరంధామయ్య గారూ పరంధామయ్యగారూ! అంటూ ఎవరో వీధి తలుపు బాదసాగారు.

బాచి వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగుండా ఒక అపరిచితుడు!

"ఎవరండీ ? ఎవరు కావాలి మీకు?" అడిగాడు బాచి.

"నన్ను జగన్నాథం అంటార్లెండి! ఇంతకీ పరంధామయ్యగారు ఇంట్లోనే ఉన్నారా?" పుల్ల విరిచినట్లు సమాధానం చెప్పి తనకు కావలసిన మనిషి కోసం ఆరా తీశాడు జగన్నాథం.

"బహుశా వారు తమ గదిలో ఉండే ఉంటారు. మీ రలా బెంచీ మీద కూర్చోండి. మీ రొచ్చినట్టు వారికి చెప్తొస్తాను." వరండాలోని బెంచీ చూపించి పరంధామయ్యగారి గదిలోకి వెళ్ళబోయాడు బాచి.

"అంత శ్రమ మీ కెందుకు లెండి? వారున్న గదికి నన్ను తీసుకెళ్ళండి లేదా వారి గది ఇక్కడేదో నాకు చూపించండి. నా కంతే చాలు!" జగన్నాథం మాటలు పూర్తి కాకుండానే, "ఎవరు బాబూ, వచ్చింది? ఓహో! మీ రటండీ, జగన్నాథంగారూ! ఎప్పుడూ లేంది ఏమిటిలా వచ్చారు? ముందలా కూర్చోండి!" అని వరండా చివరి గదిలోంచి వచ్చిన పరంధామయ్యగారు కుశల ప్రశ్నలు వేశారు.

"నేనేమీ కూర్చోడానికి రాలేదండీ! ముందీ సంగతి నాకు చెప్పండి. మీకు అద్దె డబ్బులే ముఖ్యం అనుకుంటే — మీ ఇంట్లో ఆ దివాకర్ ఉంటున్న గది నాకు అద్దె కివ్వండి—తనిస్తున్న అద్దెకంటే పదో పాతికో ఎక్కువే ఇస్తాం! ఇంతకీ దివాకర్ ఇంట్లోనే ఉన్నాడా?" జగన్నాథం కోపంగా అన్నాడు.

జగన్నాథం అలా మండిపడ్డానికి గల కారణమేమిటో ఎంత ఆలోచించినా పరంధామయ్యగారికి అంతుపట్టలేదు.

"ప్రస్తుతం దివాకర్ ఇంట్లో లేడండీ! ఉదయమే ఎక్కడికో వెళ్ళిపోయాడు. దివాకర్ ఉంటున్న గదిలో తనతోబాటు మరో ఇద్దరు మిత్రులు — ఇదిగో వీరే ఉంటున్నారు."

పరంధామయ్యగారు మూర్తిని, బాచిని చూపించారు.

"వీళ్ళతో నాకేం పనండీ? నా క్కావలసి దల్లా తక్షణ మీ ఇంట్లోంచి — మీ ఇంట్లోంచేకాదు ఈ వీధిలోంచే దివాకర్ శాశ్వతంగా పైకి పోవాలి..."

## సిరా చుక్కలు

ఆ అలు ఒట్టి అక్షరాలే కాదు
అనుభవాల, ఆరాటాల
ప్రతిరూపాలు
అక్షరాల ఊపిరి
అనుభూతీ, ఆవేశం
అక్షరాలు లేని కాగితం
అనుభవాల చారలు లేని జీవితం
అందుకే
అక్షరాలు
అక్షరాలే!

— ఎ. బసలింగప్ప

జగన్నాథం ఆయాసపడుతూ, ఆవేశపడిపోతున్నాడు.

విషయం అర్థంగాక పరంధామయ్యగారడిగేరు: "జగన్నాథంగారూ! మీరిలా దివాకర్‌మీద కారాలు మిరియాలు ఎందుకు నూరుతున్నారో అర్థంకావడం లేదండీ? మీరు ఆవేశపడకుండా సూటిగా అసలు విషయాన్ని అర్థమయ్యేట్లు చెప్పండి."

"మన దివాకర్ తత్త్వం మనకు తెలియందేమీ కాదుగా? బహుశా వీరి గురించో, లేక వీరింట్లో వాళ్ళ గురించో వివరాల్తో సహా సదరు వెధవ దేదో కథ రాసుంటాడు. వీరి కోపం — ఆవేశం చూస్తుంటే నా కలా అనిపిస్తోంది." పరంధామయ్యగారి ముఖం లోకి చూస్తూ అన్నాడు మూర్తి.

"బాబూ, మూర్తీ! నీవు కాసేపు పూరుకుంటావా?" కోపంగా, అసహనంగా అన్నారు పరంధామయ్య.

"వారినీమా దెందుకండీ మీరలా విసుక్కోవడం? వారు చెప్పింది అక్షరాలా నిజం! మా చెల్లాయి రమని మీకు తెలుసు కదా?" జగన్నాథం విసుక్కుంటూ అన్నాడు.

"మీ రమంటే! ... ఈ మధ్య ఏదో ప్రయివేటు కంపెనీలో స్టెనోగా చేరి నమ్మాయేనా? ఆ మధ్య మనం బజార్లో కలిసినప్పుడు చెప్పేరు. ఆ అమ్మాయేనా మీ రమ?" పరంధామయ్యగారు.


"నే చెప్పలేదూ? బహుశా ఆ అమ్మాయిమీద సదరు వెధవ దేదో కథ రాసుంటాడు!..." మూర్తి ఇంకా ఏదో చెప్పబోయాడు. పరంధామయ్యగారు కోపంగా తనవేపు చూడ్డంతో బుద్ధిమంతుడిలా పెదిమల్ని బంధించేశాడు వెంటనే!

"అవునండీ! ఆ అమ్మాయే మా రమ! ఈవారం పత్రికలోని 'తెర వెనుక' కథ చదివితే మీకు నా ఆవేశానికి, కోపానికి గల కారణం తెలుస్తుంది. పెళ్ళి కావాల్సిన పిల్లకి పెళ్ళిచేయకుండా నేమేదో డబ్బుకి కక్కుర్తిపడి మా చెల్లాయిని ఉద్యోగానికి పంపించినట్లు — తనేమో బాయ్ ఫ్రెండ్స్‌తో సినిమాలకు, షికార్లకు తిరుగుతున్నట్లు అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు... ఛీ ఛీ! ఆ వెధవరాతలు చెప్పడానికే ఏదోలా ఉంది నాకు. పేర్లు— వీధి పేరుతో సహా అన్ని వివరాలు కథ చదివే వారికి ఫలానా వారి అమ్మాయి గురించిరా ఈ కథ అని అందరికీ తెలిసేలా రాశాడండీ ఆ కథ!... ఇదుగో— కావాలంటే మీరు కూడా చదివి చూడండి!... మీకే తెలుస్తుంది — ఈ దివాకర్ చేస్తున్న నిర్వాకం" అలా అంటూ తన చేతిలోని పత్రిక అందించాడు జగన్నాథం.

"చెప్పలేదూ మనవాడి తత్త్వం! కుక్కతోకకి చాలా దగ్గర సంబంధం ఉందని!" మూర్తి హేళనగా అన్నాడు.

పరంధామయ్యగారు పత్రికలోని పేజీలు గంభీరంగా తిరగేస్తున్నారు.

"ఇంతకాలంఅందరూ రకరకాలుగా మీ దివాకర్ గురించి అనుకుంటున్నా—ఎన్నోసార్లు నా లాంటి వాళ్ళు మీ ఇంటి మీదకు దాడి జరిపినా ఏదో అనుకున్నాం గాని —దివాకరింత నీచుడని, ఇలాంటి వెధవ రాతలు రాస్తాడని నే నెప్పుడూ అనుకోలేదు"




జగన్నాథం దివాకర్‌ని తెరిగిపోస్తున్నాడు.

"మీలాంటి వా రిలా అన్నాళ్ళా మాటలతో పూరుకోబట్టే మా వా డిలా బరితెగిస్తున్నాడండీ! తన రాతల వల్ల ఎంతమంది బాధ పడుతున్నారో గ్రహించటం లేదు. మీరిలా పూరుకునేకంటే— ఒక సారి మీ చేతి రుచెలాంటిదో మా వాడికి తెలియజేస్తే వెంటనే రోగం కుదురుతుంది. ముందు ముందైనా ఇలాంటి వెధవ కథలు రాయకుండా ఉంటాడు!" మూర్తి తన అక్కసునంతా వెళ్ళగక్కాడు.

"అవును. అలా చేస్తేనే గాని — ఇలాంటి వెధవలకి బుద్ధిరాదు. వాడొచ్చేదాకా ఈరోజిక్కడే ఉండి తాడో పేడో తేల్చుకుంటాను."

జగన్నాథం బుర్రలో నిర్ణయంతో కూడిన భావం చోటు చేసుకుంది. అంతవరకూ గంభీరంగా ఉన్న పరంధామయ్యగారు, "చూడండి, జగన్నాథంగారూ! మీ రేమీ అనుకోనంటే ఒక్క విషయం!... రచయిత రాసే ప్రతి కథలో మనల్ని, మన పరిస్థితుల్ని పోల్చి చూసుకోవడం ప్రారంభిస్తే ప్రతి కథలోనూ ఎక్కడో ఒక చోట మన గురించే ఆ కథ రాసినట్లుందే అనిపించే సంఘటనలుగాని, సన్నివేశాలు గాని ఉండకపోవు. అందుకనే కథల్ని కథలుగానే చదువుకోవాలి! జీవితాలతో పోల్చి చూసుకోకూడదు."

"అంటే ... మీరు దివాకర్ని సమర్థిస్తున్నారన్న మాట?!..." జగన్నాథం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"అబ్బే! నా అభిప్రాయం అది కాదండీ! నేనేదో దివాకర్ని వెనకేసుకుని మాట్లాడుతున్నానని మాత్రం అనుకోకండి. ఇంతకీ మీరు కథలంటే ఏమిటను కున్నారు? కథలనేవి ఎక్కడ్నుంచి వస్తా యనుకుంటున్నారు? మనుష్యుల జీవితాల్లోనించి బయటకు వచ్చే సంఘర్షణలే కదండీ కథలకి ఆయువుపట్టు? జీవితంలోంచి పుట్టే కథలే కదండీ నిజంగా మంచి కథలు." పరంధామయ్యగారు.

"పరంధామయ్యగారూ! ఇక ఆపండి మీ హితోపదేశం! ఇన్నాళ్ళు నుంచి దివాకర్ చేస్తున్న వెధవ రాతలకి మీ మద్దతు కూడా ఉందన్నమాట?! ... అన్నీ తెలిసిన మీలాంటి పెద్దలే ఇలా అర్థం పర్థం లేకుండా మాట్లాడతారేమండీ?" జగన్నాథం విరుకోపంగా అన్నాడు పరంధామయ్యగారితో.

"జగన్నాథంగారూ! మీ రిలా కోప్పడితే నేనేమీ చెప్పలే ననుకోండి! చెప్పేది సావకాశంగా, సావధానంగా వినండి. దివాకర్ మరీ బాహాటంగా ఇంటి విషయాన్ని కథలుగా రాసేయడం ఏమైనా బాగుందా చెప్పండి? — అన్నదే కదూ మీ కోపానికి గల కారణం? ..." పరంధామయ్యగారు.

"అవునండీ!" జగన్నాథం.

"సరే! దివాకర్ చేస్తున్న పని తప్పే! కాదనను. ఈ రోజు దివాకర్ మన మధ్య ఉన్నాడని మీరిలా దుయ్యపడుతున్నారే గాని, ఈ కథే గనక మనకు తెలీని మరో రచయిత రాసుంటే మీరేం జేసేవారు? మన బ్రతుకులాగే ఉండే కథనో, లేక నిజజీవితానికి చాలా దగ్గరగా ఉండే ఈ కథనో పూరుకుని ఉండేవారు కదా? అందుకని మీరు మరోలా భావించకుండా ఈ సారి నా ముఖం చూసి పూరుకోండి. ఇకమీద టిలా జరక్కుండా చూసే పూచీ నాది. దివాకర్ వచ్చినతర్వాత మీ పరంగా అడగాల్సిన నాలుగు మాటలు అడిగి నేనే చీవాట్లు వేస్తాను సరా!" అభ్యర్థిస్తున్నట్లుగా నెమ్మదిగా అన్నారు పరంధామయ్యగారు.

జగన్నాథం కాస్త శాంతించాడు.

"సరే! మీలాంటి పెద్దలు ఇంతలా చెబుతున్నారు గనక మీ మీ దున్న గౌరవంతో ఈ సారికి పూరుకుంటున్నాను. ఇకమీద టిలా ఎవరి గురించైనా జరిగిందా మీ ప్రమేయం లేకుండానే ఆ దివాకర్నెలా పంపించాలో నాకు చాలా బాగా తెలుసు!" అంటూ విసురుగా వీధిలోకి పోయాడు జగన్నాథం. బాబి — మూర్తి — పరంధామయ్యగారు తేలిగ్గా పూపిరి పీల్చుకున్నారు.

* *

కాల ప్రవాహంలో కొన్ని నెలలు ముందుకు దొర్లాయ్. ఆ వారం ఒక వార పత్రికలో దివాకర్ కలం నుంచి పూపిరి పోసుకున్న 'విధి వంచిత' కథ పరంధామయ్యగార్ని కలవరపడేట్లు చేసింది. పరంధామయ్యగారి ముద్దుల కుమార్తె రాణి కాలేజీ చదువు చదువుతోంది. ప్రేమ ప్రవాహంలో ఎదురీద లేక అలసిపోయిన రాణిని దృష్టిలో ఉంచుకొని లేని పోనివి మరిన్ని కల్పించి 'విధి వంచిత' కథ చాలా

'ఈజీ'గా రాసి పడేశాడు దివాకర్. రాణి ఒక అబ్బాయిని ప్రేమించింది. ఆ అబ్బాయీ రాణిని ప్రేమించాడు. కులాల అంతరం కారణంగా అబ్బాయి తరపు వాళ్ళు వీళ్ళ కలయికకు అడ్డుగోడలై నిల్చున్నారు.

జరిగింది అంతే కాగా — ఇద్దరి మధ్య అంతకు మించిన కథ జరిగిందని, పాపఫలం ఎబార్షన్‌లదాకా దారితీసిందని ఇంకా ఎన్నో లేనిపోనివి కల్పించి రాసేశాడు దివాకర్. పరంధామయ్యగారి కుటుంబం గురించి తెలిసినవాళ్ళందరికీ ఆ కథ చదివిన తర్వాత 'ఇంత జరిగిందా?' అన్న ఆశ్చర్యం, అనుమానం వెలువడేట్టు చేసింది ఆ కథ.

దానితో పరంధామయ్యగారు కుంగి పడ్డారు. తన రాణిని గురించి బెంగ పెట్టుకున్నారు. ఇలాంటి అప్రాచ్యుడికి ఇల్లు అద్దె కివ్వడం తనదే తప్పు! ఇంత కాలం వాడి గురించి ఎంతోమంది ఎన్నో రకాలుగా చెప్పినా తను పట్టించుకో లేదు. ఈ రోజు తన రాణి మీదే అంత ఘోరంగా కథ రాస్తాడా? పైగా తెలియని వాళ్ళకి కూడా ఈ కథ మా ఇంటి ముసలాడి కూతురి మీద రాసిందని డప్పు వాయిస్తాడా? ఎంత సాహసం వీడికి? ఎంత ధైర్యం ఆ దౌర్భాగ్యుడికి?

ఎన్ని సార్లు వాడి మీదకు ఎంతమంది దండెత్తి రాలేదు? వాళ్ళకు తనెన్ని సార్లు సర్ది చెప్పలేదు?

ఆ విశ్వాసమైనా వాడి కుండి చావలేదే? తన మంచితనమే తన నీ వాడు వెన్నుపోటు పొడిచింది. తన దాకా వస్తేనే కాని విషయం అర్థమై చావలేదు తనకు! తన ధోరణి తనదే కాని ఎదుటి వాళ్ళ బాధని, పరిస్థితిని కాస్తయినా అర్థం చేసుకోడు కదా?

గుట్టుగా ఉన్న తన పరిస్థితినే వాడు పదిమంది మధ్య పెట్టి డప్పు వాయిస్తున్నాడే?

ఎలా వీడి పీడ వదుల్చు కోవడం? ఎలా వీడికి బుద్ధి చెప్పడం? ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటేనో? ఇంత చేసిన వాడు తన మీద కక్ష గట్టి రాణి మీద మరిన్ని పుకార్లు లేవదీసినా లేవదీయొచ్చు. అప్పుడు మరింత పుండు మీద కారం చల్లు కోవడమే అవుతుంది. ఎలా వీణ్ణి ఎదుర్కోవడం?

పరంధామయ్యగారి ఆలోచనల నిండా దివాకర్ నిండిపోయాడు.

* * *

ఆ రోజు ఆదివారం.

"ఏమిటండీ, అలా దిగాలుగా ఉన్నారు?" వరండాలో విచారంగా కూర్చున్న పరంధామయ్యగార్ని అడిగాడు దివాకర్.

"ఏం లేదు, బాబూ!" పరంధామయ్యగారు.

"ఏమీ లేదంటూ రేమిటండీ? సుమారు పది నిమిషాల్నుంచి మిమ్మల్ని చూస్తున్నా, మీలో మీరే దేని కోసమో తీవ్రంగా మథన పడి పోతున్నారు. ఇన్ని కథలు రాసిన నేను మిమ్మల్ని మీ మనస్సును ఆ మాత్రం చదవలేననుకుంటున్నారా?"

"మా బొంబాయి తమ్ముడి గురించి ఆలోచిస్తున్నాను బాబూ!"

"ఏం? వారి ఆరోగ్యం ఏమైనా బాగాలేదా?"

"అదేం కాదు బాబూ! వాడి ఆరోగ్యాని కేం— దుంపరాయిలా ఉన్నాడు. వాడి వెధవ్వేషాల మూలాన్నే

అమాయకంగా ఉండడం నేరం కాదు కానీ ప్రవర్తనవల్ల చెడును అధిగమించ విలున్నది.

—వె

వాడి జీవితం చెల్లని రూపాయిలా తయారయింది అంటూ తన బొంబాయి తమ్ముడి కథ ఒక అరగంట సేపు ఎంతో ఓపిగ్గా వివరంగా చెప్పారు పరంధామయ్య.

అంతా విన్న దివాకర్‌లోని రచయిత ఆనందంతో గంతులు వేశాడు. పరంధామయ్యగారి మీద ఒక నాలుగు సానుభూతి చినుకులు కురిపించి అర్జంటుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు దివాకర్ మరిన్ని వివరాలు అడిగి తెలుసుకుని.

* * *

"పరంధామయ్యగారూ! ఒక గుడ్ న్యూసండీ నా కథకి మొదటి బహుమతి వచ్చిందండీ అంత పెద్ద బహుమతి రావడం చాలా గొప్ప విషయమండీ!" సంతోషంతో మెలికలు తిరిగి పోతూ చెప్పాడు దివాకర్. చాలా మంచి మాట చెప్పావు బాబూ! కంగ్రాచ్యులేషన్స్ !" తన సంతోషాన్ని శుభాకాంక్షల్ని తెలిపారు పరంధామయ్య.

"బహుమతి వచ్చిన కథేమిటో మీకు తెలుసాండీ? రెణ్ణెల్ల క్రితం మీరు బాధ పడుతూ మీ బొంబాయి తమ్ముడి గురించి నాతో చెప్పారే గుర్తుందాండీ మీకు?"

"అంటే! ఈ సారి వాడి గురించా బాబూ రాసింది! మొత్తానికి నీ కథల బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు!"

"అసలు సంగతి మీకు చెప్పడం మరిచాను. ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకు హోటల్ ఇంద్రభవన్‌లో నా స్నేహితు లందరికీ మంచి పార్టీ ఇస్తున్నాను. మీరు రాణి తప్పకుండా పార్టీకి రావాలి! మరిచిపోకండేం!" అంటూ మిగతా మిత్రులకు చెప్పడానికి వెళ్ళిపోయాడు దివాకర్.

* * * *

పోటీ కథల ప్రచురణ జరిగింది. తన కథ అచ్చులో మరోసారి చదివి మురిసి పోయాడు దివాకర్. ప్రథమ బహుమతి రెండువేల అయిదొందల కోసం, తన కథపై రానున్న పాఠకుల అభిప్రాయాల కోసం ఎదురు చూడసాగాడు. తరువాయి సంచిక రానే వచ్చింది.



ఆత్రంగా ఉత్తరాల పేజీ చూసిన దివాకర్ 'షాక్' తిన్నట్టు ఫీలయ్యాడు.

దివాకర్‌గారి 'బొంబాయి తమ్ముడి' కథకు మొదటి బహుమతి ప్రకటించడం చాలా అన్యాయం! పదేళ్ళ క్రితం ఒక వారపత్రికలో 'అరుణశ్రీ'గారు రాసిన 'అసాహ్యం' కథకు ఈ కథ ఇంచుమించు ట్రూకాపీ కథ చెప్పిన తీరులో కాస్త మార్పున్నా దీని సారాంశం మక్కీకి మక్కీ కాపీ! ఈ విషయం న్యాయ నిర్ణేతలు తెలుసుకోలేకపోవడం నిజంగా శోచనీయం! ఈ విషయం గమనించగలరు.

మిగతా ఉత్తరాల సారాంశం కూడా అదే కావడంతో దివాకర్ ముఖంలో నెత్తురు చుక్క లేకుండా పోయింది. ఆ పత్రికా సంపాదకుడు కూడా అదే శీర్షికలో దివాకర్ చర్య గురించి చాలా తీవ్రంగా విమర్శించడంతో దివాకర్‌లోని రచయిత మరింత కుంగి పోయాడు.

ఎందుకిలా జరిగింది? ఎప్పుడూ ఇలా జరగలేదే? తనెప్పుడూ 'అరుణశ్రీ' కథ చదివిన పాపాన పోలేదే? తన కథ ఆ కథకు కాపీయా? అదెలా సాధ్యం? ఎంత యాదృచ్ఛికమైనా అంత దగ్గర పోలిక లున్నాయా? పరంధామయ్యగారి 'బొంబాయి తమ్ముడు' కథ ఆ అరుణశ్రీ కథ ఒకేలా ఎందుకుంటాయ్? ఉండకుండా పాఠకులు ఎందుకు ఉత్తరాల బాణాలు గురి చూసి వదిలారు? ఏమిటో? అంతా అయోమయంగా ఉంది! ఇన్నాళ్ళూ పాఠకుల దృష్టిలోను, సంపాదకుల దృష్టిలోను ఉన్న మంచి పేరు ఈ దెబ్బతో సరిలా ఉంది? కాపీ రచయితగా ముద్ర పడి పోయింది తనపై.

ఆలోచనలతో సతమతమవుతూ వరండాలోని బెంచీపై కూర్చుని పిచ్చాడిలా శూన్యం లోకి చూడసాగాడు దివాకర్. ఆ సమయంలో పరంధామయ్యగారు ఆ వారం పత్రిక చూస్తూ ఉత్తరాల శీర్షికలో లీనమై పోయారు.

దివాకర్! ఇలా ఎందుకు జరిగిందో ఎలా జరిగిందో నీకు బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాదు. నేనే కనక నీ వయస్సులో ఉన్నప్పుడు నీలా ప్రతి చెత్త గురించి కథలు రాసి ఉంటే ఈ పాటికి కొన్ని వందల కథలు రాసి ఉండేవాణ్ణి! నీ కెన్ని సార్లు మంచిగా చెప్పినా, మందలించినా నీ కుక్క లోకబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు. నీ మంచి కోరిన నాకే ఎసరు పెట్టావ్! నా రాణి గురించే అడ్డమైన రాతలూ రాశావ్! కోరి కోరి పరోక్షంగా నీ గొయ్యి నీవే తవ్వుకున్నావ్—ఆ గోతిలో నే తనుకున్న విధంగానే పడ్డావ్!

ఇక మీదట్నుంచైనా నీలో నిజమైన గుర్తింపు, మార్పు వస్తే చాలా సంతోషం. ఇంకా ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుస్తున్న బచ్చావి నీవు! సాహిత్యం విలువ నీకేం తెలుసు? ఈ అరుణశ్రీ సంగతి నీవేం తెలుసుకో గలవ్? మా బొంబాయి తమ్ముడి కథనగానే నీ లోని ఉత్సాహాన్ని గమనించాను. అందుకే పదేళ్ళ క్రితం నే రాసిన కథనే నీకు మా బొంబాయి తమ్ముడి కథగా నీ చెవిలో వేశాను. ఇకనుంచైనా జాగ్రత్తగా ఉండు.

తన పథకం పారినందుకు పరంధామయ్యగారికి వ్యంగ్యంలా అనుకుంటూ ఆనందించసాగారు. ★